
సాక్షి పల్నాడు

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



శాశ్వత పరిష్కారం

ఇంద్రకీలాద్రి: దుర్గగుడి ఘాట్‌రోడ్డులో కొండ రాళ్లు జారిపడకుండా శాశ్వత చర్యలు చేపడుతున్నట్లు దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ పేర్కొన్నారు.



సాగు నీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం నీటి విడుదలను ఆపేశారు. బ్యాంక్ కెనాల్‌కు 492 క్యూసెక్కులు వదిలారు.



ఘాట్‌రోడ్డు మూసివేత

ఇంద్రకీలాద్రి: దుర్గగుడి ఘాట్ రోడ్డును అధికారులు మూసివేశారు. శనివారం కొండ చరియలు విరిగిపడిన నేపథ్యంలో అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.

న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండండి

ప్రజలకు కలెక్టర్ పి అరుణ్ బాబు సూచన

కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు

8647252999, 9154959292



నరసరావుపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రానున్న మూడు రోజులపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి అన్ని రకాల ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. జిల్లా అధికారులు, మండల నోడల్ అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో తన చాంబర్ నుంచి శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని ఆయా శాఖలు తీసుకున్న ముందు జాగ్రత్త చర్యలపై సమీక్షించారు. అల్పపీడనం శనివారం రాత్రి తీరం దాటుతుందని, ఈ నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ చెప్పారు. ఈ వర్షాల కారణంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మండల నోడల్ అధికారులు ఈ మూడు రోజులపాటు మండలాల్లోనే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. కాల్వలు, కల్వర్టుల వద్ద కాపలా ఉంచాలని చెప్పారు. రిజర్వాయర్ల నుంచి నీరు విడుదల చేసేముందు రెవెన్యూ అధికారులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని డీపీవోకు సూచించారు. ఆసుపత్రుల్లో మందులు, అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు నేలకూలడం, వైర్లు తెగిపడటం కారణంగా ఎక్కడా ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. పంట పొలాల్లో నీరు నిలిచి ఉండకుండా చూడాలన్నారు. జిల్లా స్థాయిలో పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ నెం .08647-252999, 91549 59292 ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. టెలీకాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెస్క్యూ పరికరాలతో సిద్ధంగా ఉండండి

నరసరావుపేట: అల్పపీడనం కారణంగా జిల్లాలో కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని పోలీసులు రెస్క్యూకు కావాల్సిన పరికరాలతో సిద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శనివారం ఆదేశించారు. జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఫోన్ నెంబర్ 94407 96184, 91548 80760, 91548 80761, 94906 19394, ల్యాండ్‌లైన్ నం .08647-229999 నెంబర్లకు ఫోన్‌చేసి సమస్యను తెలియజేసి తక్షణ సహాయం పొందవచ్చునని ప్రజలకు సూచించారు. కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



నరసరావుపేటటౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ కోరారు. కార్మిక, బీఎస్ఎన్ఎల్ శాఖల అధికారులతో శనివారం కోర్టు హాలులో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కారం అయ్యే దిశగా కృషి చేయాలన్నారు. అదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్ కేసులతో పాటు సివిల్ కేసులు పరిష్కరించబడతాయన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎ.పూర్ణిమ, కె.మధుస్వామి తదితరులు పాల్గొన్నారు.

నెల రోజులపాటు అవగాహన కార్యక్రమాలు

జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆగస్టు నెల మొత్తం పట్టణంలోని పాఠశాలలు, విద్యాలయాలు, వసతి గృహాల్లో చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించినట్లు అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యశ్రీ తెలిపారు. రోజు వారి జీవితంలో అవసరమయ్యే చట్టాలు విద్యాహక్కు చట్టం, ఉచిత న్యాయ సహాయం పొందే విధానాలను వివరించినట్లు తెలిపారు.

ఎడతెరిపి లేని వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- నిలిచిపోయిన రాకపోకలు
- నీట మునిగిన పంట పొలాలు
- కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో కంట్రోల్ రూముల ఏర్పాటు



వి.రెడ్డిపాలెం గ్రామ సమీపంలో పొంగి ప్రవహిస్తున్న ఓగేరు వాగు

సాక్షి, నరసరావుపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి జిల్లా వ్యాప్తంగా 28 మండలాల పరిధిలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. రాబోవు రెండు రోజుల్లో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖతోపాటు రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ హెచ్చరికలు జారీచేసింది. జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. ప్రజలు ఇంటినుంచి బయటకు రావడానికి ఓవైపు వర్షం మరోవైపు వరద నీటితో ఇబ్బందిపడ్డారు. ఇప్పటికే జిల్లాలో ఉధృతంగా ఉన్న డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు, ఇతర వ్యాధులు ఈ వర్షాల ద్వారా విజృంభించే అవకాశముంది.

పొంగి పొర్లుతున్న వాగులు



రోడ్డుపై ప్రవహిస్తున్న రాళ్ల వాగు

భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మాచవరం మండలంలో పిల్లేరు వాగు, యడ్లపాడు మండలం పడమట వాగు, గురజాల మండలం ఎద్దుల వాగు, అమరావతి మండలం పెదమద్దూరు వాగు, రెంటచింతల వద్ద గోలి వాగు పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అచ్చంపేట మండలం దోసపాటి చెరువుకు గండిపడింది. వరదనీటిలో చిక్కుకున్న వీరభద్రకాలనీ, రాజీవ్ కాలనీ వాసులను రెవెన్యూ అధికారులు, పోలీసులు పునరావాస కేంద్రానికి తరలించారు.

నీట మునిగిన పంటలు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటపొలాలు నీటి మునిగాయి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు కారణంగా ఖరీఫ్ సీజన్ ఆలస్యంగా మొదలైంది. ప్రస్తుతం పత్తి పూత దశలోనూ, మిరప విత్తన దశలో ఉంది. ఇప్పుడిప్పుడే మాగాణి సాగుకు రైతులు ఉపక్రమించారు. ప్రస్తుతం కురిసిన వానలకు ఆయా పంటలకు పెద్దగా ఇబ్బంది లేదని, వర్షం లేదా వరద ఉధృతి పెరిగితే మాత్రం పైర్లు దెబ్బతినే ప్రమాదం ఉందంటూ వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. రొంపిచర్ల, నకరేకల్లు, అమరావతి తదితర మండలాల్లో వరిపంట నీటి మునిగింది. ఒకటి రెండు రోజుల్లో వరదనీరు తగ్గితే వరిపంటకు ఇబ్బందిలేదు.

- అచ్చంపేట జల దిగ్బంధంలో చిక్కుకుంది. ఉత్తరం వైపు మాదిపాడు, తూర్పు వైపు అమరావతి, దక్షిణం వైపు సత్తెనపల్లిల నుంచి వాగులు, వంకలు పొంగి పొర్లుతుండడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. రోడ్డుపై నాలుగు అడుగుల మేరు నీరు ప్రవహిస్తుండడంతో మాదిపాడు నుంచి అచ్చంపేటకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఇరుక్కుపోయింది. బస్సులో 20మంది విద్యార్థులు, మరో 15మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ వెంటనే స్పందించి విద్యా



నీట మునిగిన పంటను తీస్తున్న రైతు

ర్థులు, ప్రయాణికులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రెండు అడుగుల మేర నీరు నిలిచింది.

- పెదకూరపాడు మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెదకూరపాడు-సత్తెనపల్లి, గుంటూరు-పెదకూరపాడు, పెదకూరపాడు-అమరావతి, పెదకూరపాడు-పాటిబండ్ల, లింగంగుంట్ల, పాడపాడు అబ్బరాజుపాలెం, 75త్యాళ్లూరు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పెదకూరపాడులోని పేరమ్మ వాగు, పాటిబండ్ల వాగు, నీరుకుంట ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.
- క్రోసూరు మండలం విప్పర్ల గ్రామం వద్ద నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల చుట్టూ నీరు చేరింది. మండలంలోని ఊటుకూరు వద్ద గల కప్పలవాగు పొంగి ప్రవహిస్తుండటంతో గుంటూరు నుంచి క్రోసూరుకు వచ్చే ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ఊటుకూరు చప్టాకు అవతల ఉన్న గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.
- పిడుగురాళ్ల పట్టణంలోని బుగ్గవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో చెరువు పరిసర ప్రాంతాల ప్రజలంతా నీటిలో చిక్కుకున్నారు. ఎర్రవాగు ఉధృతికి శ్రీనివాసకాలనీ వద్ద పంట పొలలు మునిగిపోయాయి. శివారు కాలనీలు జగ్జీవన్‌రామ్ కాలనీ, ఆదర్శనగర్, లెనిన్‌నగర్ జలమయమయ్యాయి.
- దాచేపల్లి మండలంలో కాలువలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. నడికుడి-నారాయణపురం మార్గంలో ఉన్న రెండు వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నడికుడి-పులిపాడు గ్రామాల మధ్య ఉన్న ఆర్‌యూబీలో వర్షపునీరు నిలవటంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాచేపల్లిలోని కాటేరు వాగు కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది. నాగులేరులో వర్షపు నీరు భారీగా చేరింది. దాచేపల్లి-కారంపూడి రోడ్డులోని పలుచోట్ల నీరు రోడ్డెక్కి ప్రవహించాయి.
- గురజాలలోని దండివాగు పొంగి పొర్లుతుంది. 2014లో పొంగి పొర్లిన దండివాగు రెండు రోజులుగా కుండపోతగా కురుస్తున్న వర్షాలకు ఈ స్థాయిలో నీరుపారుతోంది.
- అమరావతి-విజయవాడ, అమరావతి-సత్తెనపల్లి, అమరావతి- క్రోసూరులకు రాకపోకలను నిలిచిపోయాయి. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పెదమద్దూరు వాగు చప్టాపై సుమారు నాలుగు అడుగుల మేర నీరు ప్రవహించటంతో పోలీసులు ప్రమాద నివారణ చర్యలలో భాగంగా రాకపోకలు నిలిపివేశారు.
- సత్తెనపల్లి పట్టణంలోని పాత కేంద్రియ విద్యాలయం ప్రాంగణం, పాత తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం, ట్రెజరీ కార్యాలయం తదితర ప్రాంగణాల్లో వర్షపు నీరు నిలిచింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడం కారణంగా ఇటు కాలనీలతోపాటు అటు పంట పొలాల్లో నీరు నిలిచింది.
- వినుకొండ పట్టణంలోని పలు వీధులు జలమయమయ్యాయి. ఇసుక వాగుబజారు, పాత మార్కెట్ బజారు, పాతశివాలయంవీధితోపాటు రాజీవ్ రజకకాలనీ, ముట్లకుంట కాలనీల్లో నీరు నిలబడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని వ్యాపార సంస్థలు, పాఠశాలలు వర్షం కారణంగా మూతపడ్డాయి. వినుకొండ రూరల్ మండంలోని పిట్టంబండ వద్దనున్న కొంకేరు, నూజెండ్ల మండలం వద్ద గుండ్లకమ్మనది పొంగి పొర్లింది. విఠంరాజుపల్లి సమీపంలోని, పిచుకలపాలెం, చిన్నకంచర్ల వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే అండర్ పాస్‌లోకి భారీగా ,వర్షపునీరు చేరటంతో రాకపోకలకు ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు గ్రామాలతోపాటు వినుకొండ పట్టణంలో విద్యుత్ సరఫరా నిలచిపోయింది.
- నాగులేరు జలకళను సంతరించుకుంది. కారంపూడి మండల పరిధిలో ఉధృతంగా ప్రవహించింది.
- రెంటచింతల గ్రామ శివార్లోని గోలివాగు పొంగి ప్రవహిస్తుండటంతో మాచర్ల- గుంటూరు రహదారిలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుంటూరు వెళ్లే ఆర్టీసీ బస్సు వాగు మధ్యలో నిలిచిపోగా జేసీబీతో ఒడ్డుకు చేర్చారు. కొత్త పాలువాయి-పాత పాలువాయి గ్రామాల మధ్యతోపాటు పశర్లపాడు గ్రామ సమీపంలో పిల్లావాగు ప్రమాదభరితంగా పొంగి ప్రవహిస్తుండటంతో పాలువాయి, తుమృకోట గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

ఎత్తిపోతలకు సందర్శకుల తాకిడి

మాచర్ల సమీపంలోని పర్యాటక ప్రాంతమైన ఎత్తిపోతలకు వరద ప్రవాహం భారీగా పెరిగింది. భారీగా వర్షాలు పడుతుండటంతో వాగులు, అటవీ మార్గాల ద్వారా వరద నీరు ఎత్తిపోతలకు చేరుకుంటుంది. ఎత్తిపోతల 70 అడుగుల ఎత్తు నుంచి భారీగా నీరు కిందకు ప్రవహిస్తూ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఎత్తిపోతల జలకళను సంతరించుకోవడంతో జలపాత అందాలు చూసేందుకు సందర్శకులు ఎత్తిపోతల చేరుకుంటున్నారు.



సొలస లోలెవల్ చప్టాపై వరద ఉధృతి



కోటప్పకొండ రోడ్డులో వాహనంపై పడిన చెట్టు



పెదకూరపాడులో రోడ్డుపై ప్రవహిస్తున్న పేరమ్మ వాగు



రెంటచింతల వద్ద గోలివాగులో చిక్కుకున్న ఆర్టీసీ బస్సును బయటకు తీస్తున్న జేసీబీ

పెదకూరపాడులో ఇద్దరు గల్లంతు

- ప్రాణాలకు తెగించి కాపాడిన ఏఆర్ కానిస్టేబుల్
- ఉధృతంగా ప్రవహిస్తున్న నీరుకుంట



సురక్షితంగా బయటపడిన వ్యక్తులతో పెదకూరపాడు పోలీసులు

పెదకూరపాడు: రాత్రి సమయంలో నీటి ఉధృతికి కొట్టుకుపోతున్న ఇద్దరు వ్యక్తులను స్థానికుడు సహాయంతో ప్రాణాలకు తెగించి ఏఆర్ మోటర్ ట్రాన్స్‌పోర్టు కానిస్టేబుల్(పి.సి నెంబర్ 932)కాపాడిన సంఘటన పెదకూరపాడు -అమరావతి మధ్య ఉన్న శర్వాన్ కోల్డ్‌స్టోరేజి వద్ద చోటు చేసుకుంది. సీఐ పత్తిపాటి సురేష్, బాధితులు తెలిపిన వివరాలు... పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామానికి చెందిన పుట్టా వెంకట్రావు, జంజాల పుల్లారావులు అమరావతి మండలం అత్తలూరు గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లి రాత్రి 8 గంటల సమయంలో 75త్యాళ్లూరు మీదగా పెదకూరపాడు వస్తున్న క్రమంలో కోల్డ్‌స్టోరేజ్ వద్ద ఉన్న నీరుకుంట ఉధృతంగా ప్రవాహిస్తోంది. నీరుకుంటకు పెదకూరపాడు వైపు పెదకూరపాడు సీఐ పత్తిపాటి సురేష్, పెదకూరపాడు ఎస్ఐ బాలూనాయక్‌లు గస్తీ కాస్తున్నారు. పోలీసులు వారించినా వినకుండా నీటి ప్రవాహం గమనించని ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై నీరుకుంట దాటే ప్రయత్నం చేశారు. నీటి ఉధృతికి వాహనంతోపాటు ఇద్దరు యువకులు కొట్టుకుపోయారు. సీఐ డ్రైవర్ సందెపోగు ఆనంద్ మోహన్, పక్కన ఉన్న స్థానికుడు పెయ్యల సాంబశివరావు నీటిలో దూకి కొట్టుకుపోతున్న వెంకట్రావు, పుల్లారావులను కాపాడారు. 40 నిమిషాలకుపాటు రిస్క్ చేశారు. కారులో ఉన్న ముగ్గురును కాపాడిన పోలీసులు నీరుకుంట వద్ద రాత్రి 7 గంటల సమయంలో అమరావతి నుంచి పెదకూరపాడు వస్తున్న కారు నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుండగా సీఐ పత్తిపాటి సురేష్, ఎస్ఐ బాలూనాయక్, ఏఎస్ఐ రాంజి నాయక్, కానిస్టేబుల్ కరిముల్లా, ఏఆర్ కానిస్టేబుల్ ఆనంద్ మోహన్‌లు రిస్క్ తీసుకోని ట్రాక్టర్ సాయంతో బయటకు లాగారు. కారులో ఉన్న అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు మరో ఇద్దరిని కాపాడారు.

యుద్ధప్రాతిపదికన పునరావాస చర్యలు చేపట్టండి



గోళ్లపాడు ఎస్టీ కాలనీ వద్ద ముంపునకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

–జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

గోళ్లపాడు(ముప్పాళ్ల): అల్పపీడన ప్రభావంతో ముంపునకు గురైన వారందరికి యుద్ధప్రాతిపదికన పునరావాస, సహాయక చర్యలు అందించాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని గోళ్లపాడు గ్రామంలోని ఎస్టీ కాలనీ వద్ద ముంపునకు గురైన కుటుంబాలతో మాట్లాడారు. గృహాల్లోకి నీరు చేరిన వారందరిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, రైతుభరోసా కేంద్రాన్ని పునరావాస కేంద్రంగా ఏర్పాటు చేసి అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్‌ను ఆదేశించారు. వారిని తరలించేందుకుగాను అవసరమైతే పోలీసుల సాయం తీసుకోవాలన్నారు. బాధితులందరికీ అవసరమైన ఆహారాన్ని అందించాలని, పిల్లలకు పాలు కూడా సరఫరా చేయాలన్నారు. కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలన్నారు.

గోళ్లపాడు వాగును పరిశీలించిన జిల్లా ఎస్పీ



పొంగి పొర్లుతున్న వాగును పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

మండలంలోని గోళ్లపాడు వద్ద గల లోలెవల్ చప్టాను జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. అల్పపీడన ప్రభావంతో సత్తెనపల్లి-నరసరావుపేట రోడ్డు లో గోళ్లపాడు వద్ద గల లోలెవల్ చప్టా మీదుగా వరద నీరు ప్రవహిస్తుండటంతో ముందస్తు చర్యలో భాగంగా చప్టాను పరిశీలించి పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. చప్టాపై నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్నప్పుడు వాహనాల రాకపోకలు నిషేధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసు సిబ్బందితో నిఘా ఏర్పాటు చేయాలని ఎస్ఐ పీ.హాజరతయ్యకు సూచించారు.

ఉప్పొంగిన రాళ్లవాగు

కారెంపూడి: నరసరావుపేట వెళ్లే రహదారిలో ఉన్న రాళ్ల వాగు రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. శనివారం సాయంత్రం రోడ్డుపై ఒక మోస్తరుగా పారిన వాగు నీరు రాత్రికి నీటి ప్రవాహం బాగా పెరిగింది. ఆ రహదారిలో రాకపోకలకు అంతరాయం కలిగింది. కారెంపూడి నుంచి పేటసన్నెగండ్ల మధ్యలో ఎన్ఎస్‌పీ మెయిన్ కెనాల్‌కు పడమరగా ఈ వాగు ఉంది.

జిల్లాలో 85.84 శాతం పింఛన్ల పంపిణీ

- అల్లూరివారిపాలెంలో పింఛన్ అందజేసిన జేసీ సూరజ్ గనోరే
- పట్టణంలో పలు వార్డుల్లో పింఛన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



అల్లూరివారిపాలెం గ్రామంలో పింఛన్ అందజేస్తున్న జేసీ సూరజ్ గనోరే

నరసరావుపేట: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శనివారం సాయంత్రం ఏడు గంటలకు 85.84శాతం పూర్తిచేశారు. మండలంలోని అల్లూరు వారిపాలెం గ్రామంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జి.సూరజ్ గనోరే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లింగంగుంట్ల గ్రామ పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్ అందజేశారు. జిల్లాలో 2,77,282 పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని లింగంగుంట్ల-2 గ్రామ సచివాలయ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఎంపీడీవో నాగిశెట్టి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 25 సచివాలయాల పరిధిలో 195 మంది పంపిణీ సిబ్బందికి 12,613 పింఛన్లు అందజేయనున్నట్లు చెప్పారు. పట్టణంలోని పలు వార్డుల్లో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని కొంతమందికి స్వయంగా అందజేసి ప్రారంభించారు. జోరు వర్షంలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ అందజేశారు. ఒకటో తేదీ ఆదివారం కావటంతో ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమాలలో ఏపీఎం భరత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కెవీ. శివప్రసాద్, సచివాలయ సిబ్బంది విజయ లక్ష్మి, వేము, టీడీపీ నాయకులు వాసిరెడ్డి రవి, మాజీ కౌన్సిలర్లు అబ్దుల్ గఫార్, గట్టుపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

రొంపిచర్లలో 220.2 మి.మీ వర్షపాతం నమోదు

నరసరావుపేట: అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు 2479.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా పరిశీలిస్తే...జిల్లాలో అత్యధికంగా రొంపిచర్లలో 220.2 వర్షం పడగా, అత్యల్పంగా నూజెండ్ల 54.8 మి.మీ కురిసింది. నరసరావుపేటలో 86.2, మాచర్లలో 111.0, వెల్దుర్తి 101.2, దుర్గి 84.6, రెంటచింతల 84.8, గురజాల 94.0, దాచేపల్లి 81.4 మి.మీ వర్షం కురిసింది. కారెంపూడిలో 66.8, పిడుగురాళ్ల 77.6, మాచవరం 60.2, బెల్లంకొండ 59.6, అచ్చంపేట 110.2, క్రోసూరు 96.8, అమరావతి 97.4, పెదకూరపాడు 81.0, సత్తెనపల్లి 65.6, రాజుపాలెం 69.4, నకరికల్లు 90.6, బొల్లాపల్లి 119.4, వినుకొండ 56.2, ముప్పాళ్లలో 125.2, శావల్యాపురం 90.2, ఈపూరు 61.4, నాదెండ్ల 70.4, చిలకలూరిపేట 78.6, యడ్లపాడు 84.4 మి. మీటర్ల వర్షం పడింది.

నీట మునిగిన ఉద్యాన పంటలు పరిశీలన



నీరు నిలిచిన వంగ తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి రమణారెడ్డి

నరసరావుపేటరూరల్: భారీ వర్షం కారణంగా మండలంలోని ఉప్పలపాడులో నీటమునిగిన కూరగాయల పంటలను జిల్లా ఉద్యాన అధికారి సీహెచ్ రమణారెడ్డి శనివారం పరిశీలించారు. పొలంలో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపే ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. వర్షాలు తగ్గిన వెంటనే 19.9.19 లేదా 13.0.45 లేదా యూరియా వంటి పోషకాలను పంటపై పిచికారి చేయాలని తెలిపారు. అంతర సేద్యం చేసి నేల త్వరగా ఆరే విధంగా చేసుకోవాలని చెప్పారు. పొలంలో నీరు నిల్వ ఉండటం వలన ఎండు తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. దీని నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటితో లేదా మెట్లాక్సిల్, మాంకోజబ్ రెండు గ్రాములు లీటరు నీటితో కలిపి మొక్కల మొదళ్లలో పోయాలని తెలిపారు. దీంతోపాటు బాక్టీరియా, ఆకుపచ్చ, కానోఫార వంటి తెగుళ్లు ఆశించే అవకాశం ఉందన్నారు. ముందు జాగ్రత్తగా కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటితో, 0.1గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ ద్రావణాన్ని లీటరు నీటితో కలిపి పిచికారి చేయడం ద్వారా నివారించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో నరసరావుపేట ఉద్యాన అధికారి నవీన్‌కుమార్, వ్యవసాయ సహాయకుడు హర్ష, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి ఉచిత ఉపాధి శిక్షణ

నకరికల్లు: యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు జాబ్స్ రిసోర్స్ కో–ఆర్డినేటర్ వై.శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు, సీడాప్–డీడీయూజీకేవై సంయుక్త ఆధ్వర్యంలో టీటీడీసీ కోటప్పకొండ నందు సోమవారం నుంచి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని 19 నుంచి 25 ఏళ్లలోపు వయస్సు కలిగి, డిగ్రీ పాస్ లేదా పెయిల్ అయిన యువతీయువకులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నాలుగు నెలలపాటు ఉచిత వసతి, భోజనంతో శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో రూ.15వేల వేతనంతో ఉపాధి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు వై.శ్రీనివాసరెడ్డి, జాబ్స్ రిసోర్స్ కో–ఆర్డినేటర్ 99084 82907 నంబరును సంప్రదించాలని తెలిపారు.

ఆర్టీసీ ఆదాయానికి వర్షం పోటు

పట్నంబజారు: వాయుగుండం ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షంతో ఆర్టీసీ ఆదాయానికి నష్టం వాటిల్లింది. గుంటూరు రీజియన్ పరిధిలోని గుంటూరు 1, 2 పొన్నూరు, తెనాలి, మంగళగిరి డిపోలకు సంబంధించి 369 బస్సులు ఉన్నాయి. వర్ష ప్రభావంతో ప్రయాణికుల రద్దీ తగ్గడంతో 180కి పైగా సర్వీస్‌లను నిలిపివేశారు. దీంతో రీజియన్ పరిధిలో శనివారం రూ. 35 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

గుర్తు తెలియని యాచకుడు మృతి



అద్దంకి రూరల్: గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన ఘటన శనివారం సాయంత్రం శింగరకొండ దేవస్థానం వెనుక ప్రాంతంలో చోటు చేసుకుంది. ఎస్సై ఖాదర్‌బాషా వివరాల మేరకు.. బిచ్చాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి (60) మండలంలోని శింగరకొండ దేవస్థానం వెనుకభాగంలో ఉన్న బట్టలు మార్చుకునే షెడ్డు వద్ద శనివారం సాయంత్రం మృతి చెంది ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై, సిబ్బంది అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యర్రబాలెం చెరువులో చేపలు పట్టిన యువకులు



మంగళగిరి: నగరంలోని శనివారం కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు, చెరువులు తెగి జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. నగర పరిధిలోని విలీన గ్రామాల్లో చెరువులకు గండ్లు పడగా నీరు గ్రామాలలోకి చేరింది. యర్రబాలెం చెరువు కట్ట తెగడంతో రోడ్డు పైకి చేపలు కొట్టుకురాగా పలువురు యువకులు చేపలు పడుతూ కనిపించారు.


జన జీవనం అస్తవ్యస్తం



అమరావతి మండలంలో చప్టాపై పొంగి ప్రవహిస్తున్న పెదమద్దూరు వాగు



జంగమహేశ్వరపురం రైల్వే గేటు సమీపంలో వాగులో కొట్టుకుపోతున్న ద్విచక్రవాహనం



పొంగి ప్రవహిస్తున్న వాగు

అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జన జీవనం అస్తవ్యస్తమైంది. జిల్లాలోని పలు వాగులు పొంగి పొర్లుతున్నాయి. పలు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. ఎడతెరిపి లేకుండా ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉండడంతో ప్రజలకు బయటకు రాలేదు. వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. -నెట్‌వర్క్



మాదిపాడు రోడ్డుపై ఐదు అడుగుల మేర నిలిచిన వర్షపు నీరు



మాచర్ల-గుంటూరు రహదారిపై అనుపాలెం వద్ద వరద ఉధృతి



వల్లప్పచెరువుకు భారీగా వరద చేరి అలుగుల నుంచి బయటకు వెళ్తున్న నీరు



పాలపాడు-పరగటిచర్ల గ్రామల మధ్య పొంగి పొర్లుతున్న వాగు



మునమాక, ముత్తనపల్లి గ్రామాల మధ్య రోడ్డుపైగా ప్రవహిస్తున్న వాగు



గోలి- జెట్టిపాలెం గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న గోలి వాగు



వరద నీటితో నిండుకుండలా మారిన యడ్లపాడులోని నక్కవాగు

సీజనల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఆకస్మిక తనిఖీలు



కలెక్టర్ అరుణ్‌బాబుకు సేవల గురించి వివరిస్తున్న వైద్యులు

సత్తెనపల్లి: సీజనల్ జ్వరాల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. సత్తెనపల్లిలోని ఏరియా వైద్యశాలను శనివారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణ మార్పులు కారణంగా సంభవిస్తున్న విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు ఎప్పటికప్పుడు అందించాలన్నారు. అవసరమైన మందులు కొరత లేకుండా చూసుకోవాలన్నారు. వైద్యశాల అంతా కలియతిరిగి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంతేకాక రోగులతో మాట్లాడి ఏఏ జ్వరంతో వచ్చారు? ఎప్పటినుంచి ఉంటున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత వహించాలని రోగులకు సూచించారు. సూపరింటెండెంట్ డాక్టర్ పి లక్ష్మణరావుకు పలు సూచనలు చేశారు. ఆయనతోపాటు పల్నాడు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మంత్రునాయక్, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి రవి, సత్తెనపల్లి ఆర్డీఓ వి.మురళీకృష్ణ, తహసీల్దార్ కె.శ్రీనివాస్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి తదితరులు ఉన్నారు.

నకిలీ ఆభరణాలతో రూ.కోటి రుణం

రహస్యంగా విచారణ జరుపుతున్న అధికారులు

తెనాలి: జాతీయ బ్యాంకులో విలీనమై, ఆ పేరుతో కొనసాగుతున్న మారీసుపేటలోని ఓ బ్యాంకు శాఖలో స్థానిక వ్యాపారి ఒకరు నకిలీ బంగారు ఆభరణాలు తనఖా పెట్టి కోటి రూపాయలకు పైగా రుణం తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. బ్యాంకు అధికారులు రెండు రోజుల కిందట ఈ విషయం గమనించారు. దీనిపై రహస్యంగా విచారణ చేస్తున్నారు. పట్టణానికి చెందిన ఒక వ్యాపారి కొంతకాలం కిందట ఈ బ్యాంకులో గృహ నిర్మాణం నిమిత్తం రుణం తీసుకున్నాడు. తర్వాత అతడికి వ్యాపారంలో నష్టం వచ్చింది. దీంతో రెండు నెలల కిందట అదే బ్యాంకులో నకిలీ ఆభరణాలు తాకట్టు పెట్టి తాను, కుటుంబసభ్యుల పేరుతో కోటి రూపాయలకు పైగా రుణం తీసుకున్నాడని చెబుతున్నారు. సంబంధిత బ్యాంకు అప్రయిజరు, బ్యాంకు ఉద్యోగి పాత్ర కూడా ఇందులో ఉందని తెలుస్తోంది. రెండురోజుల క్రితం ఈ వ్యవహారాన్ని అధికారులు పసిగట్టారు. దీనిపై విచారణ జరుగుతోంది. వ్యాపారిని పిలిపించి ప్రశ్నించటంతో మరికొంతకాలం ఈ వ్యవహారాన్ని బహిర్గతం చేయకుండా ఉండాలని, అప్పటికి తాను రుణం మొత్తం చెల్లిస్తానని చెప్పాడట! అందుకోసం కొంత డబ్బు లంచం ఆశ చూపాడని చెబుతున్నారు. దీనిపై వివరణ కోరేందుకు సంబంధిత బ్యాంకు శాఖకు ఫోను చేస్తే లిఫ్ట్ చేయలేదు. బ్యాంకుకు వెళితే మేనేజరు లేరని సెక్యూరిటీ సిబ్బంది సమాధానం చెప్పారు.

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్ట్

తెనాలి రూరల్: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న యువకుడిని జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి జీఆర్పీ స్టేషన్‌లో శనివారం వివరాలను ఎస్‌ఐ వెంకటాద్రి వెల్లడించారు. మార్చి 26న జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికురాలు ఉషాకుమారి బ్యాగ్ అపహరణకు గురైంది. ఈ నెల 25న లింగంపల్లి–నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో మరో ప్రయాణికురాలి ల్యాప్ టాప్, బ్యాగ్ అపహరణకు గురవ్వగా గుడివాడ జీఆర్పీ స్టేషనులో కేసు నమోదైంది. కేసులను విచారించిన పోలీసులు నిందితుడిని తెనాలి యడ్ల లింగయ్య కాలనీకి చెందిన గాజుల సురేష్ అలియాస్ చిన్నిగా గుర్తించారు. అతడ్ని అదుపులోకి తీసుకుని బ్యాగులు, వాటిల్లోని ఏటీఎం కార్డులు, ల్యాప్ టాప్, పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్నారు.



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌ఐ వెంకటాద్రి

శాంతిభద్రతల పరిరక్షణే పల్లె నిద్ర ధ్యేయం



బాపట్లటౌన్: శాంతిభద్రతల పరిరక్షణే పల్లె నిద్ర ధ్యేయమని జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ తెలిపారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి మండలంలోని కంకటపాలెం గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టి.పి.విఠలేశ్వర్ మాట్లాడుతూ.. స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. తొలుత గ్రామంలోని పరిస్థితులు, అసాంఘిక కార్యకలాపాల గురించి తెలుసుకున్నారు. నూతన చట్టాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా నియమాలు తదితర విషయాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు పాందురంగాపురం గ్రామంలో నిద్రించారు. సమస్యల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల గురించిన సమాచారాన్ని, అనుమానాస్పదంగా సంచరించే వారి కదలికల గురించి సమాచారం పోలీస్ శాఖకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల సర్కిల్, రూరల్ సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

బస్సులో గొడుగులతో ప్రయాణం

వినుకొండ(నూజెండ్ల): భారీ వర్షాలకు పెద్దపెద్ద భవనాలు కారడం చూశాం, నూతన టెక్నాలజీతో కట్టిన రాజధాని భవనాలు వర్షపు నీరు లీకుల వల్ల నీరు కారడమూ చూశాం. అయితే వర్షాలకు ఆర్టీసీ బస్సులు కూడా లీకులు ఇస్తాయనే విషయం వినుకొండ ఆర్టీసీ బస్సులను చూస్తేకాని అర్థమౌతుంది. వర్షంలో తడవకుండా గొడుగు సాయంతో ఆర్టీసీ బస్సులో ఎక్కితే గొడుగుతో పనిలేదు అనుకున్న ప్రయాణికులకు ఆర్టీసీ బస్సులోనూ వర్షపు నీరు బస్సుపై నుంచి కారుతూ ప్రయాణికులపై పడుతుండడటంతో షాక్‌కు గురయ్యారు. బస్సులో కూడా గొడుగులు వేసుకుని ప్రయాణించాల్సి రావంటంతో ప్రయాణికులు ఖంగుతిన్నారు.



విజ్ఞాన్-న్యూకాన్ ఏరోస్పేస్‌ల మధ్య ఒప్పందం

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ – హైదరాబాద్‌లోని న్యూకాన్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎన్ఏపీఎల్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని వైస్ చాన్స్‌లర్ పి. నాగభూషణ్ శనివారం తెలిపారు. ఎన్ఏపీఎల్ ఆర్ అండ్ డీ జనరల్ మేనేజర్ జేఎల్‌పీ తిలక్‌తో ఆయన అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాల్ని మార్చుకున్నారు. వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వల్ల ఏరో స్పేస్ ఇంజినీరింగ్, డిఫెన్స్ టెక్నాలజీ రంగాల్లో ఉమ్మడిగా పరిశోధనలతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లను సులభతరం చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం, వాటికి వినూత్న పరిష్కారాల్ని అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామని వివరించారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం, ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవాన్ని అందించడంతో పాటు వృత్తిపరమైన వృద్ధిని పెంపొందిస్తామని చెప్పారు. ఎన్ఏపీఎల్ ఆర్ అండ్ డీ జనరల్ మేనేజర్ జేఎల్‌పీ తిలక్ మాట్లాడుతూ విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో తర్ఫీదునివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎం.ఎస్. రఘునాథన్ పాల్గొన్నారు.



తిలక్‌తో పత్రాలను మార్చుకుంటున్న వైస్ చాన్స్‌లర్